క్లుప్తంగా

చురుగ్గా ఎక్స్‌ప్రెస్ హైవే



కొత్తపల్లె వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణం

గుడిపాల: మండల పరిధిలో బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. 258 కిలోమీటర్ల మేర జరిగే ఈ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బెంగళూరు నుంచి తమిళనాడు శ్రీపెరంబుదూరును కలుపుతూ రోడ్డు పనులు చేపట్టారు. మండలంలోని దాయంవారిపల్లె నుంచి 189కొత్తపల్లె, వసంతాపురం, కుప్పిగానిపల్లె, చలిచీమలపల్లె మీదుగా సాగుతోంది. స్తంభాలను నిర్మించి వాటిపై దిమ్మెలను ఏర్పాటు చేస్తున్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రమేష్

పూతలపట్టు: పూతలపట్టు జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా వి.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పెనుమూరు కళాశాలలో పనిచేస్తున్న ఆయన పూతలపట్టుకు బదిలీ అయ్యి శనివారం బాధ్యతలు తీసుకున్నారు.

రక్షణ కల్పించండి

చిత్తూరు రూరల్: కుటుంబీకుల నుంచి రక్షణ కల్పించాలని ఓ ప్రేమజంట శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ను ఆశ్రయించింది. తమిళనాడులోని విల్లుపురానికి చెందిన వానతి, కుల్లుకుర్చికి చెందిన ఆర్ముగం కొన్నేళ్లుగా ప్రేమించుకుని, పెళ్లి చేసుకున్నారు. అయితే వారి కుటుంబ పెద్దల నుంచి ప్రాణహాని ఉండడంతో చిత్తూరుకు చేరుకున్నామని చెప్పుకొచ్చారు. పోలీసులు తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న పంచాయతీ అధికారులు, కార్మికులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ మేజర్ పంచాయతీలో దోమల నివారణ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. అరగొండ సర్పంచ్ మల్లుదొరై, పంచాయతీ కార్యదర్శులు చైతన్యకుమార్, మహేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ పంచాయతీ కన్వీనర్ ప్రశాంత్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో పంచాయతీలోని అన్ని గ్రామాల్లో శనివారం డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించారు. రాత్రుల్లో ఫాగింగ్ చేపడుతున్నారు. పంచాయతీలోని డ్రైనేజీ కాలువల్లో పంచాయతీ కార్మికులు బ్లీచింగ్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ప్రజల ఆరోగ్యం కాపాడడానికి పంచాయతీల్లో పారిశుధ్యం, శానిటేషన్ పనులు చేపడుతున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

జెడ్పీ వైస్ చైర్మన్‌తో కార్పెంటర్స్ కార్యవర్గం



యాదమరి: మండలంలో నూతనంగా ఎంపికైన కార్పెంటర్స్ యూనియన్ సభ్యులు శనివారం ఉదయం జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గత వారంలో మండల కేంద్రంలో కార్పెంటర్స్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు జెడ్పీ వైస్ చైర్మన్‌ను ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రత్యేక లోక్‌అదాలత్‌లో 21 కేసుల పరిష్కారం



కక్షిదారులకు పరిష్కార పత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం నిర్వహించిన ప్రత్యేక అదాలత్ ద్వారా 21 కేసులను పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు తెలిపారు. మోటారు వాహన ప్రమాద కేసులు, భూ పరిహారం కేసులకు సంబంధించి ప్రత్యేక లోక్ అదాలత్ ను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. ఇందులో చిత్తూరు, తిరుపతి శ్రీకాళహస్తిలో 21 మోటార్ వాహన కేసులను పరిష్కారం చేసి.. రూ.1.93 కోట్లు సెటిల్ చేసినట్లు న్యాయమూర్తి వివరించారు. అదనపు జిల్లా జడ్జి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది

కార్వేటినగరం: అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో శనివారం గంగాధరనెల్లూరు మండలానికి చెందిన దాత దీపక్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆలయ అధికారి మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని అలాంటి సేవలు అందించే వారికి స్వామివారి అభయం ఎప్పుడూ ఉంటుందన్నారు.

గ్రామీణ వైద్యం.. ఇంటింటా ఆరోగ్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. రూ.కోట్లాది నిధులు వెచ్చించి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను కార్పొరేట్ హంగులతో ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆస్పత్రి అంటేనే పారిపోయే పరిస్థితుల నుంచి ప్రభుత్వ వైద్యం కోసం వెతుక్కుంటూ వచ్చే పరిస్థితులు కల్పించింది. ఇక్కడ అవసరమైన అన్ని రకాల సదుపాయాలను, మందులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అవసరమైన వైద్య సిబ్బందిని నియమించింది. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి సరికొత్త వైద్య విధానానికి శ్రీకారం చుట్టింది. తద్వారా మంచానికే పరిమితమైన రోగులకు ఇంటివద్దనే వైద్య సేవలందించి ప్రశంసలు అందుకుంటోంది.



చిటిపిరాళ్ళ హెల్త్ క్లినిక్

- మండలంలో 8 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యం
- 12,530 కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు

పూతలపట్టు: మండలంలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. మొత్తం 8 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. అందులో నాలుగు భవన నిర్మాణాలు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మండలంలో ఇప్పటివరకు ఈ భవనాలకు రూ.95 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పంచాయతీల్లో వైద్య సేవలు నిలిపివేయకుండా అందుబాటులో ఉన్న భవనాల్లో వైద్యం అందించే ఏర్పాట్లు అధికార యంత్రాంగం చేసింది. రోగులు అధికంగా పంచాయతీల్లోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ రావడంతో మండలంలోని 12,530 కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. పూతలపట్టు మండలంలో 8 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గాను 4 భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుతం ప్రతి 2500 జనాభాకు ఒక హెల్త్ సెంటర్ చొప్పున నూతన భవనాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. 14 పరీక్షలు నిర్వహిస్తున్నారు. 64 రకాల మందులను అందుబాటులో ఉంచారు. హెల్త్ సెంటర్‌లో ఒక హెంచ్‌హెల్‌పీ, ఏఎన్‌హెం, ఆశ వర్కర్లు వైద్య సేవలందిస్తున్నారు.



రోగి ఇంటికెళ్లి చికిత్స అందిస్తున్న వైద్యాధికారి

ఇంటి వద్దకే వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాటిలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ప్రత్యేకంగా ప్రజల్లో మనన్నలు అందుకుంటోంది. వైద్యాధికారులు ఇంటి వద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు. ప్రతి గ్రామాన్ని నెలకు రెండు సార్లు వైద్యులు సందర్శిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అక్కడికక్కడే వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తున్నారు. మంచంపై, నడవలేని పరిస్థితిలో ఉన్నవారి ఇంటికి వెళ్లి వారికి వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో షుగర్, బీ.పి, తదితర వైద్య పరీక్షలతోపాటు 14 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అత్యాధునిక కిట్లు ఏర్పాటు చేశారు. క్లినిక్ ద్వారా గ్రామాల్లోని పిల్లలకు, వృద్ధులకు, గర్భిణులకు, వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కొన్నేళ్లుగా వైద్యం అందని గ్రామాల్లో కూడా నేడు ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి.

అందుబాటులో వైద్య సేవలు



"మా ఇంటి సమీపంలోనే విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేసి, వైద్యసేవలు అందిస్తున్నారు. మా గ్రామం మండల కేంద్రానికి చాల దూరం. గతంలో రాత్రి అయిందంటే పిల్లలకు చిన్న జబ్బు చేసినా, మేము మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లేవాళ్లం. ఇప్పుడు మా సచివాలయం పక్కనే ఇంటి దగ్గర వైద్యం ఉచితంగా దొరుకుతోంది.

– చిలకమ్మ, చవటపల్లి, పూతలపట్టు మండలం

ఉచితంగా మందులు



వయసు మీద పడిందంటే ఒకటి తరువాత మరొకటి ఏదో ఒక అనారోగ్య సమస్య వస్తూనే ఉంది. మా పంచాయతీలో విలేజ్ హెల్త్ క్లినిక్ పెట్టినప్పటి నుంచి ఏ వ్యాధికైనా వైద్యులు అందుబాటులో ఉంచి వైద్యం చేస్తున్నారు. ఇప్పుడు వైద్యం గురించి బెంగ లేదు. చిన్న రోగం వచ్చినా ఇక్కడికి వచ్చి ఉచితంగా వైద్యం, మందులు పొందుతున్నాం.

– కె.కృష్ణయ్య, వావిల్‌తోట, పూతలపట్టు

ప్రభుత్వ ఆదేశాల మేరకే...



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి నెలకు రెండు సార్లు 104 వాహనంలో వెళ్తున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆ గ్రామంలోనే ఓపీ చూస్తున్నాం. ఇంటికే పరిమితమైన రోగుల వారింటికి వెళ్లి చికిత్స చేస్తున్నాం. హెల్త్ క్లినిక్‌లో 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. గర్భిణులు, వృద్ధులు, పిల్లలు గ్రామంలోనే వైద్యం పొందవచ్చు.

– డాక్టర్ ప్రియాంక, సివిల్ సర్జన్, పూతలపట్టు పీహెచ్‌సీ

పారదర్శకంగా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రేణుక

చిత్తూరు కలెక్టరేట్ : ఎటువంటి లోపాలు, పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్డీవో రేణుక అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. బీఎల్‌వోలతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సర్వే పై బీఎల్‌వోలకు శిక్షణ సైతం ఇచ్చామన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఓటరు గుర్తింపు కార్డుల్లోని ఫొటోలు, చిరునామాల్లో తేడాలను సవరిస్తామని తెలిపారు. సమావేశంలో పలు గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



ద్వారకాపురంలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని ద్వారకాపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 57 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 104 మొబైల్ క్లినిక్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం



సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ఐరాల: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యావ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్కరణలు తెచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశ పెట్టడం ద్వారా కార్పొరేట్‌కు దీటుగా నేడు విద్యార్థులు ఫలితాలు సాధిస్తున్నారని గుర్తుచేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఇప్పటికే ట్యాబ్‌లు అందించారన్నారు. విద్యార్థులు జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, జగనన్న కలలను సాకారం చేయాలని తెలిపారు. ముదిగోళం జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓ–2 దామోదర్‌నాయుడు విద్యార్థులకు సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని భావించిన ముఖ్యమంత్రి విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బాలకృష్ణ, కాణిపాకం ఇన్‌చార్జ్ హెచ్ఎం సురేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నేత సౌందర్‌రాజన్, ముదిగోళం పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ హేమలత, హెచ్ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల బూత్ లెవల్ ఏజెంట్లే కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్రంలో మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ప్రతి డివిజన్, పంచాయతీలో ఉన్న బూత్ లెవల్ ఏజెంట్లు కీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్‌లో ఉన్న ఏజెంట్లు బీఎల్వోలతో కలిసి క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొనాలని సూచించారు. సంబంధిత బూత్‌ల పరిధిలో కొత్త ఓటర్లు, డివిజన్ నుంచి మరో డివిజన్‌కు మారిన వారు, చనిపోయిన వారి ఓట్లు, ఇలా పలు అంశాలను ఏజెంట్లు పరిశీలించాలని చెప్పారు. కార్పొరేటర్, డివిజన్ ఇన్‌చార్జి, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీల నాయకత్వంలో ఏజెంట్లు పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు లీనారెడ్డి, గుడిపాల మండల కన్వీనర్ జనార్దన్, సర్పంచ్ అమరనాథరెడ్డి, త్యాగ, ఎంపీటీసీ ప్రతిమ, నాయకులు సంపత్, ఎల్‌బీవి లోకేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గృహాల నిర్మాణం మరింత వేగవంతం

నియోజకవర్గ పరిధిలోని జగనన్న లే అవుట్లలో గృహాల నిర్మాణాలు మరింత వేగంగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం సాయంత్రం నియోజకవర్గ రెవెన్యూ, హౌసింగ్ సమస్యలపై ఆయన ఆర్డీఓ రేణుక, తహసీల్దార్లు మురళీమోహన్, ప్రసాద్‌తో సమావేశమయ్యారు. అర్హులైన వారికి త్వరగా ఇంటి పట్టాలు ఇవ్వాలని సూచించారు. శ్మశానవాటిక, వాటి సరిహద్దులకు సంబంధించి సర్వే త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆక్రమణలు గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను గుర్తించి అక్కడ నోటీసు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ త్యాగ, నాయకులు సంపత్ సంబంధిత శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే, ఆర్డీవో

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

బంగారుపాళెం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని నల్లంగాడు గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రజలు ఇబ్బందులు పడకుండా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ పథకాలు, సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలకు సంక్షేమ పథకాలకు అవసరమైన వివిధ ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. జగనన్నకు మరోసారి అవకాశం కల్పించి రుణం తీర్చుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, స్థానిక సర్పంచ్ ధనుంజయ, ఎంపీటీసీ ఉషశ్రీ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాలక్షిరెడ్డి, సుమంత్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలటీర్లు పాల్గొన్నారు.





తవణంపల్లె : సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న అధికారులు, బంగారుపాళెం: లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

476 మంది సర్టిఫికెట్లు

తవణంపల్లె: మండల కేంద్రంలోని ధర్మరాజుల గుడిలో నిర్వహించిన జగనన్న సురక్ష సభలో ఎంపీడీఓ అబ్దుకలాం ఆజాద్ ఆధ్వర్యంలో 476 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాబు, సర్పంచ్ ధనలక్ష్మి, ఉత్తరబ్రాహ్మణపల్లె సర్పంచ్ దేవరాజులు, ఉప సర్పంచ్ రాజేశ్వరి, ఈఓఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కౌండిన్యలో హైరానా!



- మాయమవుతున్న మేకలు, గొర్రెలు
- తాజాగా లేగదూడను చంపేశాయి
- ఇది పులి పనేనని భయపడుతున్న జనం
- పులికాదు హైనా అంటున్న అటవీశాఖ

పలమనేరు: కౌండిన్య అడవిలో గత కొన్నాళ్ల నుంచి హైనాల దాడికి పలు మేకలు, గొర్రె పిల్లలు, దూడలు మృత్యువాతపడుతున్నాయి. స్థానిక అడవిలోకి పశువులను, మేకలను మేతకు తోలుకెళ్లే కాపరులు ఆందోళన చెందుతున్నారు. కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో మేకలు, గొర్రెలు, దూడలను హైనాలు పొట్టనబెట్టుకుంటున్నాయి. తాజాగా బైరెడ్డిపల్లి మండలంలోని గౌనితిమ్మేపల్లి అటవీ సమీప పొలాల వద్ద సోమవారం ఓ లేగదూడను చంపాయి. మరో దూడ గొంతు కొరికి గాయపరిచాయి. అయితే ఇది పులి పనేనని రైతులు లతీఫ్, లక్ష్మీపతి భావించారు. పులిలా చారలు కలిగిన హైనా అనే జంతువని అటవీశాఖ అధికారులు క్లారిటీ ఇస్తున్నారు. గతంలో ఇక్కడ హైనాల సంతతి తక్కువగానే ఉండేదని ప్రస్తుతం సంచరిస్తున్న పెద్ద హైనాలు తమిళనాడు అడవి నుంచి వచ్చాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా ఇప్పుడు కౌండిన్య అడవికి ఆనుకుని ఉన్న పల్లె వాసులకు హైనాతో హైరానా పడుతున్నారు.

ఆందోళన చెందుతున్న పశువుల కాపరులు..

కౌండిన్య అభయారణ్యంలో పులి ఉందంటూ పుకార్ల కారణంగా అడవుల్లోకి జీవాలను మేతకు తోలుకెళ్లాలంటే పశువుల, మేకల కాపరులు హడలిపోతున్నారు. ముఖ్యంగా రేంజ్ పరిధిలోని నెల్లిపట్ల, బాపలనత్తం, వెంగంవారిపల్లె, కడతట్ల పల్లె, కుప్పనపల్లె, దేవదొడ్డి, కైగల్, కస్తూరినగరం, చింతమాకులపల్లె, కాలువపల్లె, మండీపేట కోటూరు, జగమర్ల అటవీ సమీప గ్రామాల కు చెందిన వారి జీవాలు తరచూ అదృశ్యమవుతున్నాయి. సాయంత్రం మందలను గమనిస్తేగానీ విషయం బయటపడడం లేదు. కాపరులు అడవిలోకి వెళ్లి పరిశీలిస్తే మృతి చెందిన కళేబరాలు దర్శనమిస్తున్నాయి.



గౌనితిమ్మేపల్లి వద్ద హైనా దాడిలో మృతి చెందిన దూడ